క్లుప్తంగా

మతిస్థిమితం కోల్పోయిన మహిళ అప్పగింత

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్‌లో బుధవారం మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్న ఓ మహిళను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వచ్చి ఆమె ఆధార్ ఆధారంగా లక్ష్మణచాంద మండలం కంజర్ గ్రామానికి చెందిన ఈసరి లక్ష్మిగా గుర్తించారు. పోలీసులకు ఆమె కుటుంబసభ్యులను రప్పించి.. సదరు మహిళను అప్పగించారు. పోలీస్ కానిస్టేబుళ్లు వెంకటేశ్, చౌహాన్ కృష్ణను పలువురు అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

తానూరు: మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి తానూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం జౌలా(బి) వద్ద పోలీసులు పట్టుకున్నట్లు ఏఎస్సై నర్సింగ్‌భాను తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టుకున్న లారీని రెవెన్యూశాఖ అధికారులకు అప్పగించనున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

నూతన కార్యవర్గం



సమావేశంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

సోన్: ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం మండల కార్యవర్గాన్ని బుధవారం సోన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సోన్ మండలాధ్యక్షుడిగా అంకం సురేశ్, ప్రధాన కార్యదర్శిగా అష్టం దేవేందర్, కోశాధికారిగా పడిగేల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా ఆకుల గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా ఆరెపెల్లి రాజు, ప్రచార కార్యదర్శిగా గడ్డం సంపత్ ఎన్నికయ్యారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగం వంశీ, కెమెరా క్లబ్ అధ్యక్షులు సుమన్, వినీత్, లడ్డా ఉన్నారు.

అనాథలకు అండ



పరామర్శిస్తున్న రమాదేవి, నాయకులు

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో అనాథలుగా మారిన ఇద్దరు పిల్లలను బుధవారం నాయకురాలు రమాదేవి పరామర్శించారు. ఈసందర్భంగా వారికి రూ.10వేలను ఆర్థికసాయం అందించారు. వారికి వైద్యపరీక్షలు చేయించి.. అండగా ఉంటానని పేర్కొన్నారు. అశోక్, రావుల పోశెట్టి, రమేశ్, రాజేశ్వర్, దేవన్న, పోశెట్టి నల్ల, మొగులాజీ, ముత్యం, విజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు ఎయిడ్స్‌పై జిల్లాస్థాయి పోటీలు

నిర్మల్‌రూరల్: సైన్స్ ఎడ్యుకేషన్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై జిల్లాస్థాయి పోస్టర్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్‌లోని టీఎన్జీవో భవన్‌లో ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక చేయబడ్డ 84 పాఠశాలల నుంచి ఒక జీవశాస్త్ర ఉపాధ్యాయుడు, పదో తరగతి విద్యార్థి హాజరు కావాలని సూచించారు.

గంగనీళ్ల జాతర



నృత్యం చేస్తున్న మహిళలు

లోకేశ్వరం: దార్‌దండ్ అమావాస్య కావడంతో బుధవారం మండలంలోని ధర్మోర గ్రామంలో గంగనీళ్ల జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం గోదావరి వద్ద పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గోదావరి జలాలను తీసుకెళ్చి గ్రామదేవతల ప్రతిమలకు అభిషేకం చేశారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు ఉన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: మండలంలోని దిల్దార్‌నగర్ గ్రామానికి చెందిన రాహుల్‌గాంధీ ఫాలోవర్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు శనిగారపు కమలాకర్ రూపొందించిన స్పోకెన్ ఇంగ్లిష్ పుస్తకాలను బుధవారం ఉట్నూర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ ఆవిష్కరించారు. కమలాకర్ మాట్లాడుతూ ఐదు వేల మంది పేద విద్యార్థులు సులభంగా ఇంగ్లిష్ నేర్చుకునేందుకు పుస్తకాలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఇందులో నరేశ్, వెంకటరమణ, చంద్రశేఖర్, నరేశ్, తదితరులున్నారు.

వరికి మొగిపురుగు గండం

- పంటను దెబ్బతీస్తున్న తెగులు
- ఆందోళనలో రైతాంగం
- పట్టించుకోని వ్యవసాయశాఖ
- కుళ్లిపోతూ ఎదగని మొక్కలు



ధర్మోరలో పిచికారీ చేస్తున్న రైతు



వాస్తాపూర్ శివారులో మొగిపురుగు సోకడంతో దెబ్బతిన్న పంట

లోకేశ్వరం: ఎన్నో కష్టాల కోర్చి యాసంగిలో సాగు చేసిన వరి పంటకు మొగిపురుగు (కాండం తొలిచే పురుగు) సోకుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వానాకాలంలో అధిక వర్షాలు నష్టాలు మిగిల్చాయని.. ఇప్పుడేమో మొగిపురుగు దిగుబడులను దెబ్బతీస్తుందని వాపోతున్నారు. పురుగుమందులు చల్లినా సమస్య పరిష్కారం కావడం లేదని.. వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా యాసంగిలో 1లక్ష 20 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

నాట్లు వేసిన వెంటనే..

గతంలో పైరు పొట్ట దశకు చేరిన తర్వాత ఆశించిన మొగిపురుగు.. ఇప్పుడేమో నాటు వేసిన 20 రోజులకే పంటను దెబ్బతీస్తుంది. దీంతో కర్రలు కుళ్లిపోయి పొలమంతా ఖాళీగా దర్శనమిస్తోంది. ప్రధానంగా గత నెల డిసెంబర్‌లో నాట్లు వేసిన పొలాల్లో మొగిపురుగు ఉధృతి ఎక్కువ ఉంది. మొగిపురుగు కారణంగా తెల్లకంకి ఏర్పడి సగానికి దిగుబడి తగ్గిపోతుంది. పంటను కాపాడుకునేందుకు రైతులు ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4వేలు ఖర్చు చేసి మందులు పిచికారీ చేస్తున్నారు. కొందరు రైతుల పొలాల్లో పైరుపై మొగిపురుగు దాడి చేయడంలో వరి పంటను తొలగించి.. మళ్లీ నాట్లు వేశారు. నవంబరు మొదటి వారంలో నార్లు పోసి డిసెంబరులో నాట్లు వేసిన పొలాల్లో ఈ సమస్య ఎక్కువ ఉంది.

క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు..

జిల్లాలోని 19 మండలల్లో మొగిపురుగు బెడద తీవ్రంగా ఉంది. కొన్ని మండలాల్లో వ్యవసాయాధికారులు అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించడం లేదు. దీంతో రైతులకు మొగి పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన ఉండటం లేదు. మొగిపురుగు సోకిన పైరును తీసుకొని నేరుగా ఫర్టిలైజర్ షాపులకు వెళ్తున్నారు. వారు ఇచ్చిన మందులను తెచ్చి పొలాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో సమస్య తగ్గకపోగా.. పెట్టుబడులు మాత్రం పెరుగుతున్నాయి. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి రైతులకు సూచనలిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

వాతావరణం అనుకూలించకనే..

వాతావరణంలో మార్పులతోనే మొగి పురుగు విజృంభిస్తోంది. ఈసారి తేమశాతం ఎక్కువ ఉంది. వరినారు కొనల్లో మొగిపురుగు గుడ్లు పెడుతుంది. పైరు కొనలు తుంచి నాట్లు వేయాలి. లేకుంటే నాట్లు వేశాక అది ఉధృతం అవుతుంది. నాటు వేసిన 20 రోజుల వ్యవధిలో త్రీజీ తేదా 10 జీ గుళికలు చల్లితే మొగి పురుగును నివారించవచ్చు. వ్యవసాయాధికారులను సైతం క్షేత్రస్థాయికి వెళ్లి పంటలు పరిశీలించేలా చర్యలు తీసుకుంటాం.

–అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

15రోజులకే సోకింది



నాలుగెకరాల్లో వరి సాగు చేస్తున్న. నాటేసిన 15 రోజులకే మొగిపురుగు సోకింది. దీని నివారణకు రెండుసార్లు మందులను పిచికారీ చేసిన. ఇప్పటికే రూ.10 వేల వరకు ఖర్చు వచ్చింది. అయినా మొగి పురుగు పూర్తిగా తగ్గడం లేదు.

– మంద లింగన్న, ధర్మోర

ఇలాంటి దుస్థితి రాలేదు



ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది యాసంగిలో వరి పంటను మొగి పురుగు దెబ్బ తీస్తుంది. నేను ఎకరంలో వరి సాగు చేస్తున్నా.. ఇప్పటికే రెండుసార్లు పురుగు మందులు స్ప్రే చేశా. రూ.2వేలు ఖర్చయింది.గతంలో ఎన్నడూ ఇలాంటి దుస్థితి రాలేదు.

– మహేందర్‌రెడ్డి,అబ్దుల్లాపూర్

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

భైంసాటౌన్:క్రీడలతో శారీరక, మానసికంగా దృఢంగా ఉండవచ్చని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాశీనాథ్ బచ్చువార్ జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న డివిజనల్ లెవెల్ క్రికెట్ టోర్నీ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గానికి పీజీ కళాశాల మంజూరు కోసం కృషి చేయడంతోపాటు ఎన్‌సీసీ యూనిట్ కోసం ప్రతిపాదిస్తానని పేర్కొన్నారు. కళాశాలలో క్రీడా పరికరాలు, లైబ్రరీ, వంటగది తదితర వసతుల కోసం రూ.10లక్షలు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరోల్ల బుచ్చయ్య, కోఆర్డినేటర్ ఓంప్రకాశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

భైంసాటౌన్: ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో పలువురికి రూ.1.10 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. స్థానిక గోకుల్‌నగర్‌కు చెందిన లక్ష్మి, సోనార్‌గల్లికి చెందిన వెంకటేశ్, కాలనీకి చెందిన ప్రవళిక, కుంటాల మండలం అందకూర్‌కు చెందిన సురేశ్‌కు చెక్కులు మంజూరయ్యాయి. బీజేపీ పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, తూమోల్ల దత్రాత్రి, అనిల్, లింగురాం తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

బండ్లబాటకు మరమ్మతులు చేయాలి

ముధోల్: పంట చేన్లకు వెళ్లే రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నాయకులు తాటివార్ రమేశ్ అన్నారు. బుధవారం ముధోల్‌లో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బుధవారం పరిశీలించారు. పంట పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్లు లేక నానావస్థలు పడుతున్నామని.. అధికారులు స్పందించి జూన్ నాటికి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. టీఏ యోగేశ్ పలువురు రైతులు ఉన్నారు.

'ఆరోపణలు మానుకోవాలి'

ఖానాపూర్: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అసత్య ఆరోపణలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. బుధవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడిన వీడియోలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్న వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. శేఖర్, రాజేశ్వర్ తదితరులున్నారు.

ముధోల్: ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌నాథ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణకు కృషి

ఖానాపూర్: ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పునరుద్ధరణకు కృషి చేస్తానని టీఎస్‌సీపీఎస్ఈయూ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమలరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటాలు చేశానని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలోని గోదావరి తీరంలో రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మోకుదెబ్బ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దొనికెల మహేశ్వర్‌గౌడ్, చిన్న నర్సాగౌడ్, శంకర్‌గౌడ్, వెంకాగౌడ్, శేఖర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, జలేందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్ ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడికి వినతి

సారంగాపూర్: మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ పదవిని కొత్తపల్లి వి లాస్‌రావుకు ఇవ్వాలని అడెల్లి గ్రామానికే చెందిన పలువురు గ్రామస్తులు బుధవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం

ఖానాపూర్: గణతంత్ర వేడుకల సందర్భంగా పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఉత్తమ ప్రశంసపత్రాలు అందుకున్న మున్సిపల్ సిబ్బందిని బుధవారం ఖానాపూర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బంది సన్మానించారు. సిబ్బంది మానాల శంకర్, మద్దెల సంతోశ్, వీరగోని రమేశ్‌గౌడ్‌ను క్లబ్ అధ్యక్షుడు పడాల లక్ష్మీనారాయణ, రాచమల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో సన్మానించారు. జర్నలిస్టులు దేవేందర్, అల్వాల శ్రీనివాస్, సిరిపురం నాగరాజు, సంతోశ్, ఫణీంద్ర, ప్రవీణ్, సుధాకర్ ఉన్నారు.

మిద్దెచింతలో సౌకర్యాలు కల్పించాలి

కడెం: మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మిద్దెచింత గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. బుధవారం మిద్దెచింత గ్రామానికి వెళ్లి విద్యుత్, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో చేరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఆత్రం మానిక్‌రావు, బలవంత్‌రావు, మోతీరాం తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు కృషి

కుంటాల: ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏఎస్సై జీవన్‌రావు పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల సందర్భంగా బుధవారం మండలంలోని కల్లూరులో వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆహ్వానం

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో గంగపుత్ర సంఘం భవన ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆ సంఘ నాయకులు ఆదిలాబాద్‌లో ఎంపీ నగేశ్, ఉట్నూర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌లను కలిసి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు సురేష్, సభ్యులు ఉన్నారు.

ఖానాపూర్: ఫిబ్రవరి 1న పట్టణంలోని సాయిబాబా ఆలయంలో జరిగే జాతర మహోత్సవానికి రావాలని కోరుతూ బీజేపీ నాయకులు ఎంపీ నగేశ్‌ను కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ఇంకుడుగుంత నిర్మించుకోవాలి

కుంటాల: వర్షపునీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ఇంకుడుగుంత నిర్మించుకోవాలని డీఎల్పీవో సుదర్శన్ పేర్కొన్నారు. బుధవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో నిర్మించిన ఇంకుడుగుంతలను పరిశీలించారు. ఇంకుడుగుంతల నిర్మాణంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

పెండింగ్ జీతాల కోసం నిరసన

కడెం: తమకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలను చెల్లించాలని ఉపాధిహామీ సిబ్బంది బుధవారం ఎంపీడీవో అరుణకు వినతిపత్రం అందజేశారు. కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. ప్రభుత్వం ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీవో జయదేవ్, సిబ్బంది కవిత, ఝాన్సీలక్ష్మి, కాంతారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులున్నారు.

దస్తురాబాద్: తమకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ సిబ్బంది మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం సూపరిటెండెంట్ గోపాల్ కిషన్‌కు వినతిపత్రం అందించారు. గణేశ్, శేఖర్, శ్రీనివాస్, కాంతం, గంగారాజం పాల్గొన్నారు.

భైంసారూరల్: తమకు పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరుతూ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న సిబ్బంది బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి వినతిపత్రం అందించారు. నల్లబ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీఓ శివలింగం, ఈసీ రాజ్‌కుమార్, టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

అపరిచితులకు ఓటీపీలు చెప్పొద్దు

సారంగపూర్: ఫోన్‌కు వచ్చే ఓటీపీలను అపరిచితులకు చెప్పవద్దని ఎస్సై సాయికుమార్ అన్నారు. మండలంలోని జామ్ కేజీబీవీలో బుధవారం విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌కు వచ్చే ఓటీపీలను ఓపెన్ చేయొద్దని సూచించారు. ప్రత్యేకాధికారి అన్నపూర్ణ, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

మొక్కలను కాపాడుకోవాలి

నర్సాపూర్(జి): నర్సరీల్లోని మొక్కలకు నీటిని అందించి కాపాడుకోవాలని డీఎల్‌పీఓ రమేశ్ సూచించారు. మండలంలోని కుస్లి గ్రామ నర్సరీని బుధవారం పరిశీలించారు. అనంతరం పంచాయతీ రికార్డులు, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్డు, శ్మశానవాటికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి కృష్ణ ఉన్నారు.

కాలుష్య నివారణకు సహకరించండి

కుంటాల: కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్సై సీహెచ్ భాస్కరాచారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లోని చికెన్ వ్యాపారులు వ్యర్థాలు, ఆర్ఎంపీలు వాడేసిన గ్లూకోజ్ బాటిళ్లు, సిరంజీలను పొలాల్లో, కెనాల్ ప్రాంతాల్లో పడేయకుండా నిబంధనల ప్రకారం డంపింగ్ యార్డ్‌కు తీసుకెళ్లాలని సూచించారు.

పరీక్షప్యాడ్లు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ప్రభుత్వ జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం అదే గ్రామానికి చెందిన దాత జెడ్ల నారాయణ రూ.మూడు వేల విలువైన పరీక్షప్యాడ్లు, పెన్నులు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం మల్కాగౌడ్, పూర్వవిద్యార్థులు నవీన్, కృష్ణ, అనిల్, రాజేందర్, సందీప్, ఉపాధ్యాయులు ఉన్నారు.

అల్పాహారం ప్రారంభం

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం సాయంత్రం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ఎంఈవో నరేందర్ ప్రారంభించారు. రోజు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున విద్యార్థులు ఆకలి తీర్చేందుకు పాఠశాల ఉపాధ్యాయుడు భూమన్న యాదవ్ ముందుకొచ్చారు. పరీక్షలు ముగిసే వరకు అల్పాహారం అందిస్తానని భూమన్నయాదవ్ తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు వస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు మాధవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.



అల్పాహారం అందిస్తున్న ఎంఈవో, దాత భూమన్న

కడ్తాల్‌లో రోడ్డు పరిశీలించిన ఆర్డీవో

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో సర్వీసు రోడ్డు సమస్య పరిష్కరిస్తామని నిర్మల్ ఆర్డీవో రత్న కల్యాణి పేర్కొన్నారు. తమ గ్రామానికి సర్వీసు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో విరమించారు. బుధవారం ఆర్డీవో గ్రామానికి వచ్చి నిర్మల్ వైపు వెళ్లే వై జంక్షన్ రోడ్డును పరిశీలించారు. హైదరాబాద్ నుంచి నిర్మల్‌కు వచ్చే వాహనాలు సర్వీసు రోడ్డు నుంచి కాకుండా గతంలో ఉన్న మార్గం గుండా వెళ్లేలా ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. తహసీల్దార్ మల్లేశ్, సీఐ నవీన్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ, గ్రామస్తులు బీజేపీ నాయకులు సత్యనారాయణ గౌడ్, బర్మాదాస్, రంజిత్‌గౌడ్, రాజనర్సయ్య పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

నర్సాపూర్(జి): అనారోగ్యంతో బాధపడుతున్న మిత్రురాలికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు తోటి స్నేహితులు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03లో పదో తరగతి పూర్తి చేసిన నర్సాపూర్(జి)కి చెందిన దర్శనం రవి–స్నేహలత ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి 13 ఏళ్ల కుమారుడు ఉన్నాడు. గతేడాది రవి అనారోగ్యంతో మృతిచెందగా.. స్నేహలత ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూ వస్తోంది. బుధవారం పరిస్థితి విషమించడంతో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించాలని సూచించారు. ఈ విషయం తెలిసి ఆమెతో పదోతరగతి చదువుకున్న మిత్రులు రూ.20వేలను ఆమె కుటుంబసభ్యులకు నిర్మల్ ఆసుపత్రికి వెళ్లి అందజేశారు.



నగదు అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

'కేంద్ర మంత్రి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి'

భైంసాటౌన్: కేంద్ర మంత్రి బండి సంజయ్ గద్దర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన క్షమాపణ చెప్పకుంటే దళిత సంఘాలు, గద్దర్ అన్న సైన్యం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు శంకర్ చంద్రే, ప్రసంజిత్ అగ్రే, దేవిదాస్, రాజారాం సాహెబ్ రావు, చంద్రకాంత్, దళిత నాయకులు పాల్గొన్నారు.



భైంసాలో మాట్లాడుతున్న సంఘాల నాయకులు

మామడ: గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. మధుకర్, రంజిత్, రాజేందర్, అశోక్, సురేశ్, రత్నయ్య, భూమన్న ఉన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

తానూరు: వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు. నీటి సమస్య ఉన్న గ్రామాల వివరాలను వచ్చేనెల 10వ తేదీలోగా ఎంపీడీవో కార్యాలయంలో సమర్పిస్తే ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తామని పేర్కొన్నారు. మురికి కాలువలను శుభ్రపరిచి క్లోరినేషన్ నీటిని సరఫరా చేయాలని సూచించారు. నర్సరీల్లోని మొక్కలకు నీటిని అందించేలా చూడాలన్నారు. ఎంపీవో నసీరుద్దీన్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ పృథ్వీ, ఈజీఎస్ ఏపీవో గంగాధర్, గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో కలకలం

నిర్మల్‌టౌన్: జిల్లాలో ఓ ఉన్నతాధికారి వద్ద పని చేసే అధికారి వ్యవహారం బుధవారం కలకలం రేపింది. సదరు అధికారి పట్టణ శివారులోని ఓ ఇంట్లో వివాహితతో ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు, మీడియాకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న మీడియా ప్రతినిధులను చూసి వివాహితను ఇంట్లోనే ఉంచి తాళం వేసి సదరు అధికారి వెళ్లిపోయాడు. అక్కడికి చేరుకున్న పోలీసులు ఆ ఇంటి తాళం పగులగొట్టి.. ఆమెను భరోసా కేంద్రానికి తీసుకెళ్లినట్లు తెలిసింది. జిల్లా ఉన్నతాధికారి వద్ద ఉండే సదరు అధికారి చేసిన ఈ నిర్వాకం స్థానికంగా చర్చనీయాంశమైంది.

రెండు గ్యాంగ్‌ల మధ్య ఘర్షణ..!

- పరస్పరం దాడులు, పోలీసులకు ఫిర్యాదు

భైంసాటౌన్: పట్టణంలో రెండు గ్యాంగ్‌ల పరస్పర ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ గోపీనాథ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన ఇర్ఫాన్, ఇర్ఫాన్ పార్లె మధ్య ఆర్థిక లావాదేవీల విషయమై మంగళవారం ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో ఇరువురి వర్గాల మధ్య తగాదా జరుగగా, మధ్యవర్తులు కల్పించుకోవడంతో వివాదం సద్దుమణిగింది. బుధవారం ఇర్ఫాన్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఇర్ఫాన్ పార్లే ఇంటి వద్ద అనుమానాస్పదంగా తిరగసాగారు. భయాందోళన చెందిన ఇర్ఫాన్ పార్లే పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వస్తుండగా ఇర్ఫాన్ వర్గం అడ్డగించి దాడి చేశారు. అనంతరం ఇర్ఫాన్ పార్లే వర్గం వారు సైతం ఇర్ఫాన్ వర్గంపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి క్షతగాత్రులను ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

హెల్మెట్ లేకుంటే.. యముడు నీ వెంటే

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారు. బుధవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఓ కళాకారుడు యమధర్మరాజు వేషధారణలో ఆకట్టుకున్నాడు. హెల్మెట్ లేని ప్రయాణంలో యముడు మీ వెంటే ఉంటాడని చెబుతూ అవగాహన ర్యాలీలో పాల్గొన్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



అవగాహన

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై బుధవారం ఎస్సై సందీప్ అవగాహన కల్పించారు. ఇందులో ప్రిన్సిపాల్ సుదర్శన్, ఎన్ఎస్ఎస్ అధికారి కృష్ణ, అధ్యాపకులు జైపాల్, శోభన్‌బాబు పాల్గొన్నారు.